షెడ్లు పూర్తయ్యేనా!



డైట్ కళాశాల మైదానం పక్కన అర్ధంతరంగా నిలిచిన పనులు

- అర్ధంతరంగా పనులు వదిలేసిన కాంట్రాక్టర్
- పట్టించుకోని బల్దియా యంత్రాంగం
- అవస్థలు పడుతున్న వీధి వ్యాపారులు

కైలాస్‌నగర్: ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ వ్యాపారాలు నిర్వహించే పట్టణంలోని వీధి వ్యాపారుల ఉపాధికి భరోసా కల్పించేలా మున్సిపల్ యంత్రాంగం చేపట్టిన షెడ్ల నిర్మాణాలు అసంపూర్తిగా మారాయి. వాటి నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ అర్ధంతరంగా వదిలేశారు. ఏడాది గడుస్తున్నప్పటికి పనులు తిరిగి ప్రారంభించడం లేదు. నిర్మాణాలను పూర్తి చేసేలా చూడాల్సిన బల్దియా అధికారులు పట్టింపులేనినతంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వీధి వ్యాపారులు తమ వ్యాపారాలను నిర్వహించుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ఏడాది గడిచిన అసంపూర్తిగా..

ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో చాలా మంది రోడ్లపైనే వ్యాపారాలు చేస్తుండటంతో ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎండ, వానతో వ్యాపారులకు కూడా ఇబ్బందులు కలుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితిని దూరం చేయడంతోపాటు బల్దియాకు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకునేలా రైతుబజార్ సమీపంలోని అటవీశాఖ కార్యాలయం నుంచి ప్రభుత్వ డైట్ కళాశాల వరకు వీధి విక్రయదారుల షెడ్లతో కూడిన సముదాయాన్ని నిర్మించేలా మున్సిపల్ కౌన్సిల్ తీర్మానించింది. రూ.28 లక్షల వ్యయంతో 80 షెడ్ల నిర్మాణాలకు టెండర్లు ఖరారయ్యాయి. టెండర్ పొందిన కాంట్రాక్టర్ తొలుత ప్రభుత్వ డైట్ కళాశాల ప్రహరీని ఆనుకుని 57 షెడ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. గతేడాది ఆగస్టులో ప్రారంభించి తొలుత పనులను వేగంగా చేపట్టారు. అయితే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో నిలిపివేశారు. తిరిగి వాటి పనులను ప్రారంభించలేదు. ఫలితంగా ఏడాది గడిచినప్పటికి షెడ్ల నిర్మాణాలు అసంపూర్తిగానే ఉన్నాయి. వాటి పనులను ఎప్పుడు పూర్తి చేస్తారనేది కూడా సందేహంగానే మారింది.

పట్టించుకోని బల్దియా అధికారులు

అసంపూర్తిగా నిలిచిపోయిన షెడ్ల నిర్మాణ పనులను ప్రారంభించేలా చూడాల్సిన బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదు. డైట్ కళాశాల వద్ద షెడ్ల నిర్మాణాల కోసం చేపట్టిన ఇనుప స్తంభాలు తుప్పుపడుతున్నాయి. ఏడాది దాటినప్పటికి ఒక్కటంటే ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. బిల్లులు రాకపోవడంతోనే సదరు కాంట్రాక్టర్ ఆ పనులు నిలిపివేసినట్లుగా చెబుతున్నారు. వాటిని పూర్తి చేసినట్లైతే 57 మంది వీధి వ్యాపారులకు ప్రయోజనం చేకూరడంతో బల్దియాకు అదనపు ఆదాయం సమకూరే అవకాశముంటుంది. అయినప్పటికి అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో అటు వ్యాపారులకు ఇటు బల్దియాకు నష్టం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు ఆ దిశగా దృష్టిసారించి పనులు ప్రారంభించి త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలని వ్యాపారులు కోరుతున్నారు.

నిధుల కొరతతోనే జాప్యం

వీధి వ్యాపారుల కోసమే షెడ్ల నిర్మాణాలను ప్రారంభించాం. అయితే తగిన నిధులు లేకపోవడంతో కాంట్రాక్టర్ నిలిపివేశారు. బిల్లులు రాకపోవడంతో తాను పనులు చేయలేమని చెబుతున్నారు. ఈ విషయాన్ని కలెక్టర్‌తోపాటు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– ఖమర్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

వసతిగృహాల సందర్శన



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలికల వసతి గృహాలను ఎమ్మెల్యే పాయల్ శంకర్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు సన్నబియ్యంతో భోజనం అందిస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో లేదన్నారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం మెస్ చార్జీలను పెంచాలని ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించినట్లు తెలిపారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ఆకుల ప్రవీణ్, రత్నాకర్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శ్రీనివాస్, అర్జున్, సంతోష్, దశరథ్, మహేందర్ ఉన్నారు.

వీధి కుక్కల సర్జరీలను పరిశీలించిన ఎమ్మెల్యే



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

కైలాస్‌నగర్: మున్సిపల్ పరిధిలో వీధికుక్కల బెడద నివారణకు బల్దియా యంత్రాంగంతో ప్రత్యేక చర్యలు చేపట్టామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని జంతు సంరక్షణ కేంద్రంలో కొనసాగుతున్న వీధి కుక్కల సంతాన ఉత్పత్తి నియంత్రణ సర్జరీల ప్రక్రియను శనివారం ఆయన మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖమర్ అహ్మద్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుక్కల బెడద నివారణకు చర్యలు చేపట్టిన బల్దియా అధికారులను అభినందించారు. పట్టణంలో దాదాపు 1200 వరకు వీధి కుక్కలు ఉన్నట్లుగా తనకు సమాచారం ఉందన్నారు. వీధి కుక్కల ద్వారా ఇబ్బందులు ఉంటే నేరుగా తనకు లేదా మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. కుక్కల సర్జరీల ప్రక్రియకు మున్సిపల్ నుంచి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. గ్రేడ్-1 స్థాయి కలిగిన మున్సిపాలిటీలో అనేక సమస్యలున్నాయని వాటి పరిష్కారానికి త్వరగా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. ఆయన వెంట వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్, బీజేపీ నాయకులు ఉన్నారు.

ఈద్గా మైదానం పరిశీలన



పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్

కై లాస్‌నగర్: పట్టణంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యతనిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన మైనార్టీ ప్రతినిధులతో కలిసి జిల్లా కేంద్రంలోని ఈద్గా మైదానాన్ని సందర్శించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగగా వాటి తొలగింపునకు తీసుకోవాల్సిన చర్యలపై బల్దియా సిబ్బందికి సూచనలు చేశారు. మైదానానికి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట స్థానిక వార్డు కౌన్సిలర్ వెనుగంటి ప్రకాశ్, నాయకులు యూనీస్‌అక్బానీ తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కొత్తూరులో పర్యటిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన

తలమడుగు: పరిసరాల పరిశుభ్రత పాటించడంతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. మండలంలోని కొత్తూరు, మందగూడ తదితర గ్రామాల్లో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. పాఠశాలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం కొత్తూరు పాఠశాలను తనిఖీ చేశారు. ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంఈవో హరీశ్, పంచాయతీ కార్యదర్శి, అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి



నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న శ్రీనివాస్

బేల: గుంతల్లో, డబ్బాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి వైసి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని జూనోని గ్రామంలో మండల వైద్య బృందంతో కలిసి శనివారం ఆయన పర్యటించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి, పారిశుధ్య చర్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, టైఫాయిడ్, డెంగీ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. కూలర్ల డబ్బాలు, కుండలు, తదితర వాటిలో నిల్వ నీటిని మూడు రోజులకోసారి పారబోసి, శుభ్రం చేసుకోవాలని సూచించారు. జిల్లా ఎపడామలజిస్ట్ అశోక్, బేల పీహెచ్‌సీ వైద్యాధికారి వంశీకృష్ణ, హెచ్‌ఈవో జావిద్, మెడికల్ సూపర్‌వైజర్ శశికళ, హెల్త్ అసిస్టెంట్ బాసిద్ తదితరులు ఉన్నారు.

నిరాశ్రయుల వసతికి ప్రత్యేక చర్యలు



వివరాలను తెలుసుకుంటున్న మున్సిపల్ కమిషనర్

కై లాస్‌నగర్: పట్టణంలోని నిరాశ్రయులకు వసతి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణ, తాంసి బస్టాండ్ సమీపంలో గల బల్దియా షెల్టర్‌హోంలను మెప్మా ఉద్యోగులతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల్లోని పడకలు, నిరాశ్రయుల కోసం వసతి ఏర్పాట్లను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, ఆసుపత్రులతోపాటు వివిధ చౌక్‌ల్లో రోడ్లపై ఉండే నిరాశ్రయులకు వసతి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. తాంసి బస్టాండ్ వద్ద గల కేంద్రంలో కొన్ని మరమ్మతు చేపట్టి త్వరలో అందుబాటులో తీసుకువస్తామన్నారు. ఆయన వెంట మున్సిపల్, మెప్మా సిబ్బంది ఉన్నారు.

రేపు బీజేపీ వర్క్‌షాప్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని సోమవారం బీజేపీ సభ్యత్వ నమోదుపై వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ తెలిపారు. ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ హాజరవుతారని పేర్కొన్నారు. బూత్ కమిటీ అధ్యక్షులు, మోర్చాల అధ్యక్షులు రావాలని సూచించారు.

క్లుప్తంగా

'ఏజెన్సీ బంద్' విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తుడుందెబ్బ నాయకులు

ఇంద్రవెల్లి: న్యాయమైన డిమాండ్ల సాధనకు ఈనెల 27న నిర్వహించే ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని తుడుందెబ్బ మండల అధ్యక్షుడు పుర్క చిత్రు కోరారు. మండలంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2024 డీఎస్సీలో ఏజెన్సీ కోటా ప్రకటించాలని, జీవో 3 యథావిధిగా కొనసాగించాలని, ప్రత్యేక ట్రైబల్ అడ్వయిజరీ కమిటీ ఏర్పాటు చేయాలని, ఐటీడీఏలో బ్యాక్‌లాక్ పోస్టులు భర్తీ చేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ 9 తెగల సమన్వయ కర్త కొట్నాక్ భారిక్‌రావ్, తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు గెడం భారత్, డివిజన్ ఉపాధ్యక్షుడు పుర్క హనుమంత్‌రావ్, నాయకులు పృథ్వీరాజ్, సోయం వినోద్, మెస్రం జైరాం, కుమ్ర భీంరావ్, ముకుంద్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



పూలాజీబాబా చిత్రపటం వద్ద బలరాం జాదవ్

ఇచ్చోడ: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. మండలంలోని ముఖరా(బి)లో నిర్వహిస్తున్న పూలాజీబాబా ధ్యానమందిర వార్షికోత్సవంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పూలాజీబాబా సేవ మార్గంలో పయనించాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామస్తులు ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం



రోగులకు మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది

ఇచ్చోడ: దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుష్మాన్ ద్వారా మేలు చేకూరుతుందని ఆయుష్మాన్ జిల్లా ప్రోగాం మేనేజర్ ప్రీతల్, ఇచ్చోడ ఆయుష్ డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మండల కేంద్రంలో ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఫార్మసిస్ట్ సత్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను కలిసిన నాయకులు



కృష్ణను సన్మానిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: డీఎంహెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన కృష్ణను యువజన కాంగ్రెస్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయన్ను శాలువతో సత్కరించి, పూల మొక్కను అందజేశారు. ప్రకాశ్, మేకల జితేందర్, ముత్యాల సురేశ్ ఉన్నారు.

ఉపాధి కూలి వెంటనే చెల్లించాలి



రోడ్డు పక్కన నాటుతున్న మొక్కలను పరిశీలిస్తున్న ఏపీడీ కుటుంబరావు

తాంసి: ఉపాధి పనుల్లో భాగంగా కూలి వెంటనే చెల్లించాలని ఏపీడీ కుటుంబరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా కూలీలు నాటుతున్న మొక్కలను, తర్వాత నర్సరీని పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇప్పటివరకు నాటిన మొక్కలు, చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈసీ గంగయ్య, టీఏలు రాజన్న, స్వప్న, పుష్ప, ఫీల్డ్ అసిస్టెంట్ సాయి, నర్సరీ నిర్వాహకుడు విలాస్ తదితరులు ఉన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



జిల్లాకేంద్రంలో..



ఇచ్చోడలో..



బోథ్: కుచులాపూర్‌లో



జైనథ్: గిమ్మ జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఆదిలాబాద్/జైనథ్/బోథ్/ఇచ్చోడ: జిల్లాలోని విద్యాసంస్థల్లో కృష్ణాష్టమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు గోపికలు, చిన్ని కృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్నారు. ఆనందోత్సాహాల మధ్య ఉట్టి కొట్టారు.

కళాకారుడికి సన్మానం



మిట్టు రవిని సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ కళా రత్న అవార్డుకు ఎంపికైన పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన కళా కారుడు మిట్టు రవిని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ సన్మానించారు. జిల్లా కేంద్రంలోని చైర్మన్ నివాసంలో శనివారం శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జానపద, శాస్త్రీయ నృత్యంలో రాణిస్తూ కళాకారులను ప్రోత్సహిస్తున్న మిట్టు రవి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, ధమ్మపాల్, కొండ గణేశ్, సంజయ్ పాల్గొన్నారు.

రెగ్యులర్ వార్డెన్లు నియమించాలి

ఉట్నూర్‌రూరల్: ఐటీడీఏ పరిధిలోని విద్యాసంస్థల్లో రెగ్యులర్ వార్డెన్లు నియమించాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ కోరారు. శనివారం ఆయన ఐటీడీఏ డీడీ వసంత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్‌చార్జి వార్డెన్లు సక్రమంగా విధులు నిర్వహించడం లేదన్నారు. ఇటీవల పలుచోట్ల విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ముజీబ్, మహెందర్, బాబాశ్యామ్, భూమన్న, రవి, బాలాజి, అన్వేశ్, హైమద్, తాజ్, తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ పునఃపరిశీలించాలి

ఉట్నూర్‌రూరల్: ఎస్సీ వర్గీకరణ నిర్ణయాన్ని సుప్రీంకోర్టు పునఃపరిశీలించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి డివిజన్ ప్రధాన కార్యదర్శి తొటి ఆశన్న అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్గీకరణతో మాలలు, ఉపకులాలు, విద్య, ఉద్యోగ, ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. దళితుల మధ్య ఐక్యత దెబ్బతింటుందన్నారు. నాయకులు సుబాశ్, కనకరావు, సుశీల్, మదు, వెంకటి, రవి, పాల్గొన్నారు.

శవపేటిక విరాళం

తాంసి: భీంపూర్ మండలం కరంజి(టి) గ్రామానికి చెందిన సురేశ్ జైస్వాల్ రూ.20 వేల విలువైన శవపేటికను శనివారం విరాళంగా అందజేశారు. మృతదేహాలను గ్రామంలోని వైకుంఠధామాలకు చెరవేసేందుకు ఈ శవపేటిక అందించినట్లు తెలిపారు.

ఐటీడీఏ పీవోను కలిసిన ప్రిన్సిపాల్



పీవోను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, లెక్చరర్లు

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.ప్రతాప్‌సింగ్ ఉట్నూర్ ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తాను మర్యాదపూర్వకంగా కలిశారు. పీవో చాంబర్‌లో శనివారం ఆమెను శాలువతో సన్మానించి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాలలో గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఏటా టాస్క్ ద్వారా ప్రత్యేక శిక్షణ ఇప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈనెలలో గిరిజన విద్యార్థుల కోసం ఉపాధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సాయిప్రసాద్, లెక్చరర్లు నర్సింగ్‌రావు, రాణి, రవీందర్, రాజశేఖర్, ముజీబ్, శ్రీనివాస్, జావిద్, పీడీ అనిత, సీనియర్ అసిస్టెంట్ పెంటన్న తదితరులు ఉన్నారు.

సామాజిక వర్గ పోరాటాలు చేయాలి



మాట్లాడుతున్న మల్లేశ్

ఎదులాపురం: కులవివక్షకు వ్యతిరేకంగా జమిలిగా సామాజికవర్గ పోరాటాలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కార్యకర్తలకు శనివారం రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అసమానతలు, సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా సామాజిక వర్గపోరాటాలను జమిలిగా ముందుకు తీసుకెళ్లాలన్నారు. అప్పుడే దోపిడీ లేని, కుల అంతరాలు లేని సమాజాన్ని స్థాపించవచ్చని అన్నారు. పార్టీ సీనియర్ నాయకుడు లంక రాఘవులు, జిల్లా కమిటీ సభ్యురాలు మంజుల, నాయకులు బండి దత్తాత్రి, కిరణ్, జిల్లా కమిటీ సభ్యులు ఆశన్న, సురేందర్, స్వామి, లింగాల చిన్నన్న, పొచ్చన్న, జమున, శకుంతల, పోచక్క, పోసాని, ప్రవీణ్, ప్రభుదాస్, ఆరిఫా, ఆశన్న, స్వామి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఆదిలాబాద్‌రూరల్: కాంప్లెక్స్ పరిధిలో టీడబ్ల్యూపీఎస్ పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మామిడిగూడ కాంప్లెక్స్ హెచ్‌ఎం రొడ్డ శైలజ అన్నారు. కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులతో మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అంగ్లం చదవడం, రాయడం వచ్చేలా నాణ్యమైన విద్యాబోధన చేయాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందేలా చూడాలన్నారు. ఎవరైనా ఉపాధ్యాయులు సెలవులపై వెళ్తే ముందస్తుగా సమాచారం అందించాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. అందులో భాగంగానే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఉపాధ్యాయులు ఇస్తారి, బాలకిషన్, రాంజీ, స్వామి దాస్, మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

గృహజ్యోతిపై అవగాహన

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్‌లో శనివారం గృహజ్యోతి పథకంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏడీఈ డీపీఈ వై.విజయసారథి మాట్లాడుతూ జీరో కరెంట్ బిల్లు రానివారు ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏవైన ఇబ్బందులుంటే స్థానిక విద్యుత్ కార్యాలయంలో విద్యుత్ అధికారిని సంప్రదించాలన్నారు. డీపీఈ విద్యుత్ అధికారి (ఏఈ) యోగేష్, లైన్‌మెన్ రమేశ్, విద్యుత్ విజిలెన్స్ కానిస్టేబుల్ నాగరాజు బారే పాల్గొన్నారు.

ఒంటెలు సరుకులతో వెళ్తూ..



ఇచ్చోడ: అటవీ ప్రాంతంలో గొర్రెలు మేపుతూ రాజస్థానీలు జీవనోపాధి పొందుతున్నారు. ఓ ప్రాంతం నుంచి మరో చోటకు తమ సామగ్రిని ఒంటెలతో తరలిస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అటవీ ప్రాంతంలోని దారులు బురదమయమయ్యాయి. మండల కేంద్రంలో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి ఒంటెల ద్వారా అటవీ ప్రాంతానికి తరలిస్తుండగా శనివారం సాక్షి క్లిక్‌మనిపించింది. అటు గుండా వెళ్లే ప్రజలు ఆసక్తిగా గమనించారు.